అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

## కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ:కాంగ్రెస్ నేత దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభు త్వంపై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో భారత సర్వోన్నత న్యాయస్థానం ఈ నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజరు కరోల్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

## చీనాబ్ రైల్వే వంతెన ప్రారంభం

జమ్మూకాశ్మీర్: అమృత్ తెలంగాణ: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని మోడీ ప్రారంభించారు. జమ్మూకాశ్మీర్‌లో పర్యటించిన మోడీ.. అక్కడ ప్రతిష్మాత్మకంగా నిర్మించిన చీనాబ్ రైలు వంతెనను ఆవిష్కరించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. చీనాబ్ రైలు వంతెనను భారతీయ రైల్వే ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించింది. ఈ వంతెన జమ్మూకాశ్మీర్‌లోని జమ్మూ డివిజన్ రియాసి జిల్లా బక్కల్–కౌరీ మధ్య ఉన్నది. కాశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు. ఈ బ్రిడ్జ్‌ను ప్రధాని మోడీ జాతికి అంకితం ఇచ్చారు. ఇక తన పర్యటనలో భాగంగా సుమారు రూ.46,000 కోట్ల ప్రాజెక్టులకు కట్రాలో మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

సంపుటి: 01 సంచిక : 236. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.07.06.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# కణతపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తా

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: 'నా కణతపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తానని' మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ ఆయన్ను క్రాస్ ఎగ్జామిన్ చేసింది. అఫిడవిట్ తీసుకుంది. విచారణ ముగిసిన అనంతరం ఈటల మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక మంత్రిగా పనిచేశానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమాచారమంతా కేసీఆర్, హరీశ్‌రావు దగ్గరే ఉందని తెలిపారు. ఇందులో ఆర్థిక శాఖ పాత్ర పెద్దగా లేదన్నారు. ఆ శాఖకు అన్ని విషయాలూ తెలియవని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో నా పాత్రేమీ లేదు. ప్రాజెక్టు రీడిజైనిం గ్ కోసం కేసీఆర్ క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు చైర్మెన్‌గా ఉన్నారు. నీటి లభ్యత అంశాన్ని దృష్టిలో పెట్టుకుని మేడిగడ్డ వద్ద ఆనకట్టు నిర్మాణం చేపట్టారు. బ్యారేజీల నిర్మాణం సాంకేతిక నిపుణులకు సంబంధించి అంశం. ఆ నిర్మాణంపై రాజకీయ నాయకులకు ఏం తెలియదు. రూ. 63 వేల కోట్లతో మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రతిపాదన చేశారు. తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ. 82 వేల కోట్లకు పెరిగిందని ఈటల చెప్పారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థిక శాఖ ప్రమేయం ఉందా అని కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ఈటలను అడగ్గా దీనిపై ఆర్థిక శాఖకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. ఇది పూర్తిగా నీటిపారుదల శాఖకు సంబంధించినదన్నారు. నా కణతపై తుపాకీ పెట్టినా సరే..నిజమే మాట్లాడతా..తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తేలుస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రిపోర్టులు బయటపెట్టాలి. కాళేశ్వరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దు. ప్రాజెక్టు నష్టాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి. కఠినంగా శిక్షించాలి. ఈ ప్రాజెక్టు తన మానస పుత్రిక అని కేసీఆర్ వందలసార్లు చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా నైతిక విలువలు పాటించా' అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

కమిషన్ ఎదుట ఈటల చెప్పిన అంశాలివే..

క్యాబినెట్ నిర్ణయం మేరకే బ్యారేజీల నిర్మాణం జరిగిందని ఈటల రాజేందర్ కాళేశ్వరం కమిషన్‌కు చెప్పినట్టు సమాచారం. ఇన్‌కెమెరాలో విచారణ జరిగింది. ఈ సందర్భంగా కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ పలు ప్రశ్నలు సంధించారు. ఈసందర్భంగా



ఈటల స్పందిస్తూ సాంకేతిక కమిటీ, క్యాబినెట్ సబ్ కమిటీ సిఫారసు మేరకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. సీడబ్ల్యూసీ, మహారాష్ట్ర అభ్యంతరాల దృష్ట్యా ప్రాజెక్టు లోకేషన్‌ను తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చినట్టు చెప్పారు. నిధుల కొరత దృష్ట్యా కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు వివరించారు. పారిశ్రామిక, తాగునీటి వినియోగంపై డబ్బు వసూలు చేయాలని డీపీఆర్‌లో ఉందన్నారు. బ్యారేజీల నిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా అని ఈటలను కమిషన్ ప్రశ్నించగా, నిర్మాణ అంశాలన్నీ నీటిపారుదల శాఖ కిందకే వస్తాయని ఈటల సమాధానం చెప్పారు. మూడు బ్యారేజీలపై ఎవరి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నారు అని కమిషన్ అడగ్గా, క్యాబినెట్ నిర్ణయం మేరకేనని బదులిచ్చారు. టెక్నికల్ కమిటీ రిపోర్టు ఇచ్చిందా అని ప్రశ్నించగా, టెక్నికల్ కమిటీ చాలా రిపోర్టులు ఇచ్చిందనీ, తుదిగా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని ఈటల వివరించారు. రీడిజైన్ చేయడానికి సబ్ కమిటీ సంతకం చేసిందా అని ఘోష్ ప్రశ్నించగా, అందుకు ఈటల స్పందిస్తూ అవును, సబ్ కమిటీ సంతకం చేసిందని అంగీకరించారు. డీఆర్పీ కోసం రూ.5.97 కోట్లు వ్యాప్కోస్ సంస్థకు ప్రభుత్వం డబ్బులు ఇచ్చిందా అని అడగ్గా తెలియదని ఈటల జవాబిచ్చారు. రుణాలు ఎలా రీపేమెంట్ చేయాలని అనుకున్నారని కమిషన్ అడగ్గా, కార్పొరేషన్ నుంచి నిధులను సమకూర్చుకుని రుణాలు తిరిగి చెల్లించాలని అనుకున్నామనీ, అయితే అలా చేయలేకపోయినట్టు అంగీకరించారు.

# మావోయిస్టుల బంద్‌తో ఉత్తర తెలంగాణలో హైఅలర్ట్

అమృత్ తెలంగాణ: ఈనెల 10న మావోయిస్టులు భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ముఖ్యంగా, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పోలీసులు అంతర్గత హైఅలర్ట్ ప్రకటించారు. ఇటీవలన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 27 మంది వరకు కీలకమైన నాయకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ భారీ ఎన్‌కౌంటర్‌ను నిర్వహించినందుకు సాయుధ బలగాలను ప్రధానమంత్రితో పాటు దేశ హౌం మంత్రి అభినందించారు. మావోయిస్టు చరిత్రలోనే ఇంత భారీ ఎన్‌కౌంటర్ జరగటం, ఏకంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శే మరణించటాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతున్నది. ఈ ఘటనతో మావోయిస్టు పార్టీ దాదాపుగా తుడుచుపెట్టుకుపోయినట్టేనని కేంద్ర హౌం శాఖ కూడా ప్రకటించింది. అయితే, తమ పార్టీ అగ్రనాయకత్వాన్ని సాయుధ బలగాలు చుట్టుముట్టి, హింసించి చంపాయని ప్రకటించిన మావోయిస్టు జాతీయ ప్రతినిధి అభరు.. ఇందుకు నిరసనగా పదో తేదీన భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఒకవైపు మావోయిస్టు



పార్టీ బలం తగ్గిపోయిందనీ, ప్రభుత్వాలు భావిస్తూనే.. మరోపక్క, ముందు జాగ్రత్త చర్యలను చేపడుతున్నాయి. తాము పూర్తిగా దెబ్బ తినలేదని నిరూపించుకోవటానికి మావోయిస్టులు తెగించి ఏదేనీ భారీ హింసకు పాల్పడే ప్రమాదమున్నదని కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోతో పాటు రాష్ట్ర యాంటీ నక్సలైట్ విభాగం నిఘా అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ రాష్ట్ర పోలీసు శాఖను కూడా అధికారులు హెచ్చరించారు.

పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : డీజీపీ జితేందర్

ప్రస్తుత పరిస్థితుల నడుమ ఉత్తర తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతో పాటు ఇంటెలిజెన్స్ అధికారులతో డీజీపీ జితేందర్ పరిస్థితిని సమీక్షించారు. వారికి పలు ముందుజాగ్రత్త చర్యలను సూచించారు. ముఖ్యంగా, శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మావోయిస్టు రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా భావిస్తున్న ఓదేలు అలియాస్ భాస్కర్ ఎన్‌కౌంటర్ కావటంతో ఉత్తర తెలంగాణలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అదే సమయంలో, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టుల కదలికలపై నిఘాను పెంచటమేగాక గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్ సాయుధ బలగాలతో కూంబింగ్ ఆపరేషన్‌ను ఉధృతం చేశారు. ఇందుకు అవసరమైన అదనపు బలగాలనూ అక్కడ మోహరించారు. మరోవైపు, బంద్ సందర్భంగా మావోయిస్టుల నుంచి ఎలాంటి చిన్న హింసాత్మక సంఘటన కూడా చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణతో పాటు మావోయిస్టు ప్రభావితం రాష్ట్రాలను కేంద్ర హౌం శాఖ హెచ్చరించింది.

# ఎరువుల సప్లయ్ లో కేంద్రం కొరత

హుస్నాబాద్ :అమృత్ తెలంగాణ: కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల సప్లయ్లో కొరత పెట్టినప్పటికీ.. రాష్ట్ర ప్రభు త్వం ఎరువులు, యూరియాకు ముందే బఫర్ స్టాక్ పెట్టుకున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నా బాద్ మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన రైతు మహోత్సవ కార్యక్రమానికి ఎడ్ల బండిలో ఊరేగింపుగా మంత్రులు తుమ్మల, పొన్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలంటే మానవాళికి కావాల్సిన అన్ని పంటలు పండించాలన్నారు. రైతును బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం రైతు భరోసా కింద ఇప్పటికే రూ.35వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి కూడా సాగుకు ముందే రైతు భరోసాను అందజేస్తామన్నారు. కాగా పంట సాగు విషయంలో రైతులు మెళకువలు పాటించాలన్నారు. మన తాతలు రెండు కిలోల యూరియా వాడితే మనం 150 కిలోల యూరియా వాడుతున్నామని తెలిపారు. ఇతర దేశాలు మన పంటలు కొనాలంటే వారు టెస్ట్ చేసినప్పుడు అది పనికి వచ్చేలా ఉండాలన్నారు. ప్రకృతి సిద్ధంగా సేంద్రీయ ఎరువులతో పండిస్తే.. ఆ పంటకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని చెప్పారు. వ్యవసాయ యూనివర్సిటీ వీసీ, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, అనుభవం ఉన్న రైతుల ద్వారా మెళకువలు నేర్చుకోవాలన్నారు. మన భూమికి ఏ పంట అవసరం.. ఏ పంట వేస్తే ఆదాయం అధికంగా వస్తుందని చూసిన తర్వాతే పంటలు వేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తెచ్చుకునే పరిస్థితి వచ్చిందని.. అలా కాకుండా ఇతర దేశాలకూ కూరగాయలు ఎగుమతిచేసే స్థాయికి ఇక్కడి రైతులు ఎదగా లన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక వృద్ధి సాధించవచ్చని తెలిపారు. హుస్నా బాద్‌కు దగ్గరలోనే నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని వచ్చే నెల్లో ప్రారంభిస్తామ న్నారు. హార్టికల్చర్, అంతర పంటల ద్వారా



ఆదాయం వస్తుందని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. నష్టం వస్తున్నా.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సన్‌ఫ్లవర్, జొన్నలు, మక్కలు, పెసలు కూడా కొనుగోలు చేశామన్నారు. దీనిపై రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రాజకీ యాలకతీతంగా రైతులను ఆత్మీయంగా దగ్గర పెట్టుకోవాల న్నారు. పాడి పరి శ్రమ, ఆవులు, గేదెలు, చేపలు వ్యవసాయ అనుబంధ రంగాలను రైతులు పెంచా లన్నారు. మునగ ద్వారా మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి.. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవ రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, అబ్దుల్ హమీద్, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మెన్లు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలను ఏపీకి తరలిస్తున్నారు ఆపే సత్తా లేదా..?

దుబ్బాక :అమృత్ తెలంగాణ: ''తెలంగాణ నుంచి 400 టీఎంసీల గోదావరి జలాలను ఏపీకి అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం గుడ్లప్పగించుకుని చూస్తుందా.. వాటిని ఆపే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి లేదా..'' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని, కేంద్ర మంత్రులను కలవరని, నిటిఆయోగ్‌లో సీఎం మాట్లాడడని అన్నారు. ఈ సర్కార్ ఏపీ నీటి దోపిడీని అడ్డుకోకపోగా.. చంద్రబాబు అడుగులకు మడుగులొత్తుతోందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని కేపీఆర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. గంధమల్ల ప్రాజెక్టు కాళేశ్వరంలో అంతర్భాగమని, కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జలాలు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు. అపెక్స్ కమిటీ, అంతర్రాష్ట్ర అనుమతి, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబును ఎదిరించే దమ్ము, సుప్రీంకో ర్టుకు వెళ్లే సత్తా రాష్ట్ర సర్కార్‌కు లేవని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తాత్కాలిక కేటాయింపుల ప్రకారం 65 టీఎంసీలు తక్కువ వాడిన



మొట్టమొదటి చేతగాని ప్రభుత్వం రేవంత్ రెడ్డిదేనని, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడం వల్ల పంటలన్నీ ఎండిపోయాయని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేబినెట్‌లో మాట్లాడేందుకు సమయం దొరకలేదా అని, కేవలం వారి కమీషన్లు, పర్సెంటేజీలు, హై కమాండ్‌కు పంపే మూటల గురించే ఐదు గంటల సమయాన్ని వెచ్చించారని ఆరోపించారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్ వెళ్తుందన్న మాటకి కట్టుబడి ఉంటామని తెలిపారు. బనకచర్లతో తెలంగాణ రాష్ట్రం గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, ఆ పనుల్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేస్తే, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక మొదలుపెట్టిందని అన్నారు. తక్షణమే ఆ పనులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇంతగా అన్యాయం జరుగుతుంటే ఇక్కడి కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదో సమాధానం చెప్పాలన్నారు.

ప్రజలను నిరాశ పరిచేలా కేబినెట్ నిర్ణయాలు

ప్రభుత్వం ఉద్యోగులను, రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచేలా కేబినెట్ నిర్ణయాలు ఉన్నాయని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఓపిఎస్‌ను అమలు చేసి పెండింగ్ డీఏలను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఉద్యోగులను రాచి రంపాన పెడుతూ వారిని నిట్టనిలువునా ముంచుతున్నారని అన్నారు. రేవంత్ సర్కార్ తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కార్యదర్శులను ఇబ్బంది పెడుతుందని, పంచాయతీ నిర్వాహణ భారమై అప్పుల పాలయ్యారని, తెలంగాణలో అప్పు లేని పంచాయతీ సెక్రెటరీ లేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

నల్లగొండ :అమృత్ తెలంగాణ: ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు మూసీ నది కాలుష్యంతో ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు మూసీ ప్రక్షాళన చేస్తానంటే బీజేపీ, బీఆర్ఎస్‌కు ఎందుకింత అక్కసు.. ఎవరు అడ్డు వచ్చినా ప్రక్షాళన చేసి తీరుతాం.. ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీర్చుతాం'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం, తుర్కపల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంతోపాటు సుమారు రూ.1051.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. నవంబర్ 11న తన జన్మదినం సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి పాదాల చెంత మూసీ వెంట పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నానని చెప్పారు. ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చి పనులు మొదలు పెట్టామని, కానీ మోకాళ్ల కట్టె పెట్టి అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో యమునా నది, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి గంగానది ప్రక్షాళన చేస్తే తప్పు లేదుగానీ తెలంగాణలో మూసీ నది కాలుష్యం నుంచి ప్రజలను కాపాడుకుంటామంటే తప్పేంటని ప్రశ్నించారు. ఆరు నూరైనా మూసీ నదిని ప్రక్షాళన చేసి గోదావరి నదీ జలాలతో నింపుతామని తెలిపారు. పదేండ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. ఎస్ఎల్బీసీకి, డిండికి నిధులు ఎందుకు ఇవ్వలేదని? ఎందుకు పూర్తి చేయలేదని ? ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో కేసీఆర్ చుట్టూ దయ్యాలు చేరాయని స్వయంగా ఆయన కుమార్తె కవిత ప్రకటించారని, అందువల్ల బీఆర్ఎస్‌లో ఉన్న దయ్యాలు ఎవరో తేల్చాలని అన్నారు. ఇకపై భారత రాష్ట్ర సమితి కాదని, దయ్యాల రాష్ట్ర సమితి(డీఆర్ఎస్) అని పేరు ప్రకటించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను దెయ్యాలుగా అభివర్ణించాలని సూచించారు.

పీవీకే కమిషన్ ఎదుట హాజరు తప్పలే ..

''కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై కేసీఆర్‌కు నోటీసులు జారీ చేస్తే.. కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్ అని అంటారా? దేశానికి ప్రధానిగా చేసిన పీవీ నరసింహారావుకే ఒక సందర్భంలో కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ప్రధాని స్థాయి నాయకుడే కమిషన్ ఎదుట హాజరయ్యారు. కేసీఆర్ నువ్వు ఎంత.. నీ స్థాయి ఎంత అని'' సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు సహకరిస్తే తెలంగాణను 10 ఏండ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీ




కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. తెలంగాణ ప్రజలు దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములయ్యేలా నిలబెడతామని, జపాన్, సింగపూర్ సరసన రాష్ట్రాన్ని నిలుపుతామని అన్నారు. దేశంలో వందేండ్లలో ఎవరూ చేయని విధంగా మొదటిసారి కులగణన చేపట్టి రాష్ట్రంలో 56.36శాతం బలహీన వర్గాలు ఉన్నారని లెక్కలు తీశామన్నారు. విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు.

ఆలేరు నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అన్ని సామాజిక తరగతుల పిల్లలు ఒకే చోట చదువుకునే విధంగా 100 నియోజకవర్గాల్లో రూ.20వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్‌కు వైటీడీ (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్)బోర్డు ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాదిరిగానే ఇక్కడ చేపట్టే ప్రభుత్వ వైద్య కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్తామని, దేశంలోనే గొప్ప యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని క్యాబినెట్‌లో చర్చించి.. ఒక కొలిక్కి తెచ్చామన్నారు. గత పదేండ్లలో ఏనాడైనా మొదటి తేదీన జీతాలు పడ్డాయా.. ఆనాడు జీతాలు చెల్లించలేనివారు ఈ రోజు మాట్లాడుతున్నారని విమర్శించారు.

# ఇక నెలకు రెండుసార్లు క్యాబినెట్

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ఇక నుంచి ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలను నిర్వహిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా మొదటి, మూడో శనివారం మంత్రివర్గ సమావేశాలు జరుగుతాయని వివరించారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం లేకుండా వేగం పెంచాలనీ, అందుకే రెండు, మూడు నెలలకోసారి కాకుండా నెలకు రెండు సార్లు నిర్వహిస్తామని వివరించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు వీలుగా రెండు వారాలకోసారి మంత్రివర్గ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని




అధికారులను సీఎం ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు 17 సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగాయని తెలిపారు. గురువారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్న విషయం తెలిసిందే.

# రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే పాయల్ శంకర్



శిలా పలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



భూమి పూజ చేస్తున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ న్యూస్ : జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో శ్రీ రాముల కల్యాణ మండపం నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 50 లక్షల నిధుల వ్యయంతో కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అలాగే మకోడ గ్రామంలో గ్రామపంచాయతీ బిల్డింగ్ 20 లక్షలతో ఈరోజు ప్రారంభించారు ఆకుర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ బిల్డింగ్ ని ప్రారంభించారు అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా గ్రామంలో 30 ఇళ్లను మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. ఒక మంచి ఆలోచనతో నీతితో విలువలతో కూడిన రాజకీయం చేస్తూ ముందుకు వెళుతున్నానని అన్నారు. నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన అవకాశం వల్లనే అసెంబ్లీలో రైతుల సమస్యలపై మాట్లాడి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరిగిందన్నారు. అధికారమనేది సొంతం కాదని.. ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమని తెలిపారు. దీపాయిగూడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఏ రోజు కూడా గ్రామానికి వచ్చిన దీపాయిగూడ గ్రామస్తులు తనకు మనస్ఫూర్తితో ఆశీర్వాదం అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధికారులు మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి . రాకేష్ రెడ్డి. అశోక్ రెడ్డి. విశాల్ విజయ్ గంగాధర్ భూమన్న వేద వ్యాస్ భూమన్న సింగడి రమేష్ రెడ్డి. ఆసి రెడ్డి. వెంకట్ రెడ్డి.. దత్త తదితరులు పాల్గొన్నారు

# ముస్లిం సోదర, సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : శనివారం బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగ జరుపుకుంటారని, త్యాగనిరతికి నిదర్శనమన్నారు. ఈ పండుగ పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకుంటారని, అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు.



# స్వచ్ఛ భారత్ మిషన్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, వినూత్న పరిష్కారాలు, అమ్మ ఆదర్శ పాఠశాల చెల్లింపులు , వన మహోత్సవం

## ఎజెండా అంశాల పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ :ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్వహించడానికి సమగ్ర పరిష్కారాలు అవసరం అని ఇందులో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, రీసైక్లింగ్ , పారవేయడం మెరుగుపరచడం, పర్యావరణానికి హానికరమైన పద్ధతుల నుండి దూరంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని, ఇచ్చోడ, ఉట్నూర్, జైనథ్ లలో రీ సైకిలింగ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు లేబర్ ద్వారా ఫిట్టింగ్ ప్లాంట్స్ రెడీ చేయాలి 2025 సంవత్సరంలో శాఖల వారిగా మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యం 46.574 లక్షలు, 2026 సంవత్సరంలో 38.938 లక్షలు లక్ష్యాలను సాధించాలని అన్నారు. వనమహోత్సవం లో భాగంగా అవెన్యూ, బండ్, కమ్యూనిటీ ప్లాంటేషన్, హరితవనాలు, ఈత ట్యాంక్ బండ్, MGNREGS, హోమ్ స్టీడ్ లలో



నాటడానికి గాను జిల్లా లక్ష్యం 27,87,000 గా నిర్ణయించడం జరిగిందన్నారు. మహిళ సంఘాలకు అప్పగించిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేసిన మహిళలకు 18%GST కట్ చేస్తున్నారని , మూడు జిల్లా సమాఖ్య కటింగ్స్ నీ విడుదల చేయాలని జిల్లా ప్రెసిడెంట్ ముదుల్కర్ వనజ సెక్రటరీ ప్రేమల ఆయా మండల మహిళలు గత నెల కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఈ రోజు మీటింగ్ నిర్వహించి అధికారులతో చర్చించడం జరిగింది. కొన్నికొన్ని గ్రామాలలో mb రికార్డు సరిగ్గా జరగలేదని మళ్ళీ ఇంకో సారి mb రికార్డు చేయించాలని 18%gst 3% జిల్లా సమాఖ్య అమౌంట్ నీ విడుదల చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు

# శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కో ఆర్డినేషన్ మీటింగ్ లో సీజనల్ వ్యాధుల సంసిద్ధత పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
## నివారణ చర్యలు, ముందస్తు ప్రణాళిక రూపొందించాలి
## ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ పై సమీక్ష నిర్వహించిన కలెక్టర్.








హాజరైన అధికారులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ప్రస్తుత వాతావరణం పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలకు, ప్రతి ఒక్కరికి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం ప్రచారం నిర్వహించి, వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, అదనపు వైద్యాధికారి, వైద్యాధికారులతో కలిసి సీజనల్ వ్యాధులు నివారణ తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు దృష్ట్యా జిల్లాలోనీ ప్రజలకు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు సమావేశాలు నిర్వహించాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్య, విషజ్వరాల పై పూర్తి అవగాహన తీసుకోవలసిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీలు, పట్టణస్థాయిలో మున్సిపల్ వార్డులలో విద్యాసంస్థలలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యే రీతిలో ప్రచారం నిర్వహించాలని, అందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, విద్యాశాఖ, మెప్మా, స్వయం సహాయక బృందాలు, తదితర సాధనాల ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆసుపత్రుల్లో అన్ని వసతులు కల్పించాలని, ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, వైద్య సేవలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు . పాఠశాలలు జూన్ 12 న పున: ప్రారంభం అవుతున్నందున్న ప్రతీ పాఠశాలలో , హాస్టల్, స్కూల్స్, అంగన్వాడి కేంద్రాలు వాటర్ శాంపుల్స్ ల్యాబ్ కి పంపించి నీటి తీరు ఎలా ఉందో రిపోర్ట్ తీసుకోవాలన్నారు. శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించి చికెన్ షాప్, ఖాళీ ప్లాట్స్, డ్రైయినేజీ, లలో, ఎక్కడెక్కడ చెత్త ఉన్న చోట పరిశుభ్రత పాటించాలని, సంబంధిత యజమానులకు ముందుగా తెలిపి పరిశుభ్రంగా ఉంచాలని, లేనియెడల ఫైన్ వేయడం జరుగుతుందని మున్సిపాలిటీ సిబ్బంది అవగాహన కల్పించాలని , ఈ వర్షాకాలం లో సీజనల్ వ్యాదులు రాకుండా ముఖ్యంగా హైరిస్క్ గ్రామాలలో ప్రత్యేక శ్రద్ధవహించాలను ఆదేశించారు. మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, తదితర వ్యాధులు ప్రబలకుండా phc లలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. శానిటేషన్ జవాన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మున్సిపాలిటీ పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. అలాగే ఇంట్లో స్టోరేజ్ వాటర్ ఎక్కువరోజులు ఉన్న వాటిని తొలగించాలని , ఈగలు,దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. గతం లో కొన్ని హై రిస్క్ ప్రాంతాలలో ఎక్కువ కేసులు వచ్చాయని ఈ ఏడాది వాటి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ సమావేశం లో జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్, సీఈఓ జితేందర్, సంబంధిత జిల్లా అధికారులు,ఎంపిడిఓ లు, ఎంపీఓ లు, వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న, చోరికి గురైన 100 మొబైల్ ఫోన్లు (దాదాపు 13 లక్షల విలువ) బాధితులకు తిరిగి అందజేత.

మొబైల్ ఫోన్ పోయిందా.. సీఈఐఆర్ లో ఫిర్యాదు చేయాలి.
జిల్లాలో ఇప్పటివరకు 800 మొబైల్ ఫోన్లు బాధితులకు తిరిగి అందజేత.
మొబైల్ ఫోన్లు తిరిగి రాబట్టడం కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు.
15 రోజుల వ్యవధిలో 100 మొబైల్ ఫోన్లు తిరిగి సంపాదించిన బృందం.
సంతోషం వ్యక్తం చేసి, జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసిన బాధితులు.
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.









అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ప్రస్తుత సమాజంలో మొబైల్ ఫోన్ లేనిదే ఎలాంటి పని జరగని సందర్భంలో మన కు అత్యంత విలువైనది, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సాంకేతిక పరికరం మొబైల్ ఫోన్. మొబైల్ ఫోన్లో అన్ని వివరాలు, అన్ని జ్ఞాపకాలు, అన్ని లావాదేవీలకు సంబంధించిన అప్లికేషన్లు ఉంటాయి, సాధారణంగా ప్రజలు మొబైల్ ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగలించబడటం జరుగుతుంది. తిరిగి వాటిని సంపాదించాలంటే, ఈ సందర్భంలో బాధితులు వెంటనే https://www.ceir.gov.in అనే వెబ్సైట్ లో లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా నందు ఇలా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి సంపాదించడం కోసం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ప్రత్యేకంగా రికవరీ బృందాన్ని ఏర్పాటు చేశారని, ఇలా జిల్లా ఎస్పీ ఆదేశాలతో వీరు గత 15 రోజుల వ్యవధిలో దాదాపు వివిధ రాష్ట్రాల నుండి జిల్లాల నుండి బాధితులు పోగొట్టుకున్నటువంటి, దొంగలించబడినటువంటి 100 మొబైల్ ఫోన్ లను తిరిగి రాబట్టడం జరిగింది. మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు వారు ఎంతగానో కష్టపడి కొనుక్కున్న మొబైల్ ఫోన్ను తిరిగి వారికి అందజేయాలని సదుద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఈ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశం మందిరంలో ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 100 మొబైల్ ఫోన్లు (దాదాపు 13 లక్షల విలువ చేసే ) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. జిల్లాలో ఇప్పటివరకు 800 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి నెల రోజుల లో పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ఫిర్యాదుకు ఎలాంటి మీసేవ సెంటర్లలో చలాన్లు కట్టవలసిన అవసరం లేదని తెలిపారు. ముఖ్యంగా రాబట్టిన మొబైల్ ఫోన్లు హర్యానా, మహారాష్ట్ర లలో ఉండటం వాటిని ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో తిరిగి రాబట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, పట్టణ సీఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, కె ఫణిదర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, ప్రత్యేక బృందం సభ్యులు పి గోపి కృష్ణ, ఎస్ సంజీవ్, ఎం ఎ రియాస్, మజీద్, జి త్రిశూల్, నవనీత్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి, బడిబాట పాటను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.





బడిబాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం గుడిహత్నూర్ మండలం మాన్నూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభించి బడిబాట పాటను ఆవిష్కరించారు.

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట 2025-26 కార్యక్రమాన్ని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నూర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్నటువంటి సౌకర్యాలు మౌలిక సదుపాయాలు, డిజిటల్ క్లాస్ రూమ్స్, బోధన కృత్రిమ మేధా తరగతుల నిర్వహణ, అనుభవ అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులచే పాఠశాలలో బోధిన , తెలుగు ఇంగ్లీష్ మీడియం లో బోధన, ఆరోగ్య పాఠశాల నిర్వహణ, ఆహ్లాదమైనటువంటి పాఠశాల వాతావరణము, క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఇలా అనేక రకాలైనటువంటి కార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయని పదవ తరగతి ఫలితాలలో ఉన్నత ఫలితాలను సాధించుకున్నామని,, ప్రభుత్వ పాఠశాల యొక్క నమోదును పెంచే విధంగా ప్రతి ఒక్క పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బడిబాట పాటను ఈ వేదిక నుండి ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారి ఉదయ్ రావు, ఎంపిడిఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ , APM, anganwadi super visor, మండలంలోని వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు, గ్రామస్తులు, SHG సభ్యులు పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమాన్ని జూన్ 6వ తేదీ నుండి జూన్ 30 వరకు గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని అన్నారు.

# సిబ్బంది నిజాయితీతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

## సిబ్బంది కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలి.

## ఎప్పటికప్పుడు రికార్డులను నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలి.

## నూతనంగా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ.






అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : కేటాయించిన విధులను సక్రమంగా, జిల్లా పోలీసు కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలియజేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయం నందు స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సిబ్బంది సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మొదటగా పూర్ణకుంభంతో వేద మంత్రాచరణలన నడుమ జిల్లా ఎస్పీ ఘన స్వాగతం పలికిన అర్చకుడు, స్పెషల్ బ్రాంచ్ కార్యాలయాన్ని కి ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అంతా శుభం జరగాలని కోరుకుంటూ, రిబ్బన్ లాగి కార్యాలయాన్ని ప్రారంభించారు. స్పెషల్ బ్రాంచెస్ సిబ్బంది నీతి నిజాయితీలతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు 24 గంటలు అప్రమత్తతో ఉంటూ సేవలందించాలని తెలిపారు. జిల్లా పోలీసు యంత్రాంగానికి స్పెషల్ బ్రాంచ్ అనేది నిఘా వ్యవస్థలా పనిచేస్తుందని, అనునిత్యం ప్రజలతో కలిసి మనసే ఉంటూ ప్రజలలో కలిసిపోయి సమాచారాన్ని సేకరించాలని, ముందస్తుగా సేకరించిన సమాచారాన్ని అధికారులకు అందించి ఎలాంటి శాంతి భద్రత ల సమస్యలు తగలకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికలను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సిబ్బంది కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఆపరేషన్స్ బి సురేందర్ రావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, డి సి ఆర్ బి డి ఎస్ పి సిహెచ్ నాగేందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ పి మోహన్, ఇన్స్పెక్టర్లు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, ఎస్సై అన్వర్ ఉల్ హాక్, ఏఎస్ఐ సురేందర్, ఫరూక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా అంతటా వరి కొనుగోలు చివరి దశకు చేరుకున్నదని, మిగిలిన ధాన్యాన్ని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, అధికారుల సమిష్టి కృషితో సజావుగా కొనుగోలు కొనసాగిందని చెప్పారు. తడిసిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి మద్దతు ధరకు సేకరిస్తున్నామని, ఒక్క గింజ మిగలకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు 1,76,843 మె.టన్నుల వరి సేకరించామని, గత ఏడాదితో పోలిస్తే 6,090 మె.టన్నులు అధికమని చెప్పారు. 38,841 మంది రైతులు వడి విక్రయించగా, మొత్తం ప్రక్రియను డీసీఎస్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ నెంబర్ 9182958858 ను సంప్రదించాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా, అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీసీఎస్ఓ కిరణ్ కుమార్, మేనేజర్ సుధాకర్,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో వరదల నియంత్రణకు సమర్థ చర్యలు తీసుకోవాలి

## నిర్మల్ జిల్లా ఫ్లడ్ మ్యానువల్ - 2025 పుస్తకావిష్కరణలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




పుస్తకం ఆవిష్కరిస్తున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : వర్షాకాలంలో సంభవించే వరదల్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబరులో నిర్మల్ జిల్లా ఫ్లడ్ మ్యానువల్ - 2025 పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరంలో జిల్లాలో నమోదైన వరదల వివరాలు, వాటి తీవ్రత, వాటివల్ల జరిగిన ఆస్తి, పంట నష్టం తదితర సమాచారాన్ని ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచినట్టు తెలిపారు. నివాస గృహాలు, రహదారులు, వంతెనలు, వ్యవసాయ పంటలకు జరిగిన నష్టం అంచనాలు, విలువలు వివరంగా పొందుపరచినట్లు చెప్పారు. ప్రస్తుత వర్షాకాలంలో తక్షణం తీసుకోవలసిన చర్యలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు వంటి అంశాలు ఈ మ్యానువల్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో జాప్యం జరగకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి జీవరత్నం, పాల్గొన్నారు.

# భూభారతి చట్టం అమలుతో ప్రజల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : శుక్రవారం సారంగాపూర్ మండలంలోని యాకర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజల భూ సమస్యలను అధికారులే ప్రత్యక్షంగా గ్రామాలకు వచ్చి స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిన తరువాత భూ రికార్డుల పరంగా ఎన్నో సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెండు దశల్లో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు తమ భూ సమస్యలపై దరఖాస్తులను సదస్సుల సందర్భంగా సమర్పించాలని, వాటిని అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని కలెక్టర్ వివరించారు. దరఖాస్తులన్నింటినీ రిజిస్టర్లలో నమోదు చేసి, అభ్యర్థులకు రసీదులు అందించాలని అధికారులకు సూచించారు. సదస్సులకు హాజరయ్యే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన కలెక్టర్... ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఆ తరువాత బడిబాట కార్యక్రమం, పాఠశాల విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై చేపడుతున్న కార్యక్రమాలపై మండల విద్యాశాఖ అధికారులను కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీదేవి, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగకు భారీ బందోబస్తు ఏర్పాటు

## జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేసిన జిల్లా ఎస్పీ జి జానకి షర్మిల




అమృత తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : మతసామరస్యాన్ని కాపాడుతూ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి కనుక అన్ని వర్గాల ప్రజలు, మత పెద్దలు సహకరించాలి. జిల్లా ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ డా . జి. జానకి షర్మిల ఐపిఎస్.. రేపటి బక్రీద్ పండుగకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా జిల్లాలోని పోలీసు సిబ్బంది తో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగింది. ఇట్టి బందోబస్తు ను జిల్లా ఎస్పీ జి జానకి షర్మిల ఈ రోజు స్వయంగా పరిశీలించి సిబ్బంది కి దిశానిర్దేశం చేయటం జరిగింది. జిల్లా ప్రజలకు రేపటి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు. బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మత సామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా లో ఎవరైనా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు సృష్టించిన లేదా ప్రేరేపించిన వారి పైన కఠినమైన చర్యలు తీసుకోవటం జరుగుతుంది అని ఎస్పీ గారు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా గత పది రోజులుగా అంతర్రాష్ట్ర, అంతర జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి చెక్ పోస్ట్ నందు పోలీసు సిబ్బంది తో 24 గంటలు వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లాలో ఆకస్మిక తనిఖీలను నిర్వర్తిస్తూ అక్రమ రవాణా జరగకుండా కాపాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు తెలియజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులు వచ్చిన ప్రజలు అట్టి పోస్టులను చూసిన వెంటనే ప్రతిస్పందించకుండా, సంయమనం పాటిస్తు అట్టి పోస్టల్లో నిజానిజాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని,సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్ట్ చేసిన ,ఫార్వార్డ్ చేసిన వారితో పాటుగా గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# ఆసుపత్రుల్లో అధిక చార్జీలు వద్దు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



హాజరైన డాక్టర్స్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి: జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ – 2010 నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం - 2010, మహిళ శిశు రక్షణ చట్టాల అమలు, పర్యవేక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మహిళా శిశు రక్షణ చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ఆసుపత్రులు రోగుల నుండి అధిక చార్జీలు వసూలు చేయకూడదని, ప్రతి ఆసుపత్రిలో రేటు చార్ట్‌ను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. రోగులతో మర్యాదగా మాట్లాడే తీరు ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, బయో మెడికల్ వేస్ట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ వైద్య సంస్థలు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ ల్యాబ్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం కింద నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధంగా పనిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. PC & PNDT చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. సంబంధిత చర్యలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 7337448722 ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, తగిన ఫీల్డ్ తనిఖీలను నిర్వహించాల్సిందిగా వైద్యాధికారులకు సూచించారు. మానవతా విలువలు మరవకుండా వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో సమయానికి అప్‌డేట్ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అనంతరం పిసి / పిఎన్ డిటి చట్టం, అమ్మ రక్ష పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.రాజేందర్, వైద్యులు గోపాల్ సింగ్, సురేష్, సరోజ, సునీల్, ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జన్నారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్సైలకు సన్మానం




జన్నారం: అమృత్ తెలంగాణ: జన్నారం ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై రామగుండం కమిషనరేట్ వీఆర్గా గా బదిలీ అయిన రాజవర్ధన్, బదిలీపై అదే కమిషనరేట్ నుండి జన్నారం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి.అనుషను మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రెస్ క్లబ్ భవనంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండి సమాజానికి సమాచారం తెలియపరిచే నాలుగవ స్తంభం పాత్రికేయులేనని అన్నారు.

# చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసినా కఠిన చర్యలు తప్పవు.

## ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై పోక్సో కేసు కూడా నమోదు చేయబడుతుంది.

## ఇలాంటి చర్యలపై జిల్లా సైబర్ టీం ద్వారా ప్రత్యేక దృష్టి. జిల్లా ఎస్పీ డా .జి.జానకి షర్మిల ఐపీఎస్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఇటీవలి కాలంలో కొందరు వ్యక్తులు చైల్డ్ పోర్న్ వీడియోలు చూడటం, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, వివిధ సోషల్ మీడియా ఖాతాలలో షేర్ చేయడం మరియు ఫార్వార్డ్ చేయడం వంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటిని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం లేదా గూగుల్‌లో వాటి కోసం వెతకడం వంటి చర్యలను జిల్లా పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని జిల్లా ఎస్పీ గారు స్పష్టం చేశారు. చైల్డ్ పోర్నోగ్రఫీ అనేది ఒక తీవ్రమైన నేరమని, దీనికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినమైన పోక్సో కేసులు చేయబడతాయని హెచ్చరించారు. పోర్న్ వీడియోలు చూడటం, వాటిని తయారు చేయడం, పంపిణీ చేయడం మరియు ప్రచారం చేయడం వంటి కార్యకలాపాలు సమాజంలో అసభ్యతను వ్యాప్తి చేయడమే కాకుండా, మహిళలు మరియు పిల్లల గౌరవాన్ని దిగజారుస్తాయి. అంతేకాకుండా, ఇది సైబర్ నేరాల పరిధిలోకి వస్తుంది మరియు సంబంధిత చట్టాల ప్రకారం కఠినమైన శిక్షార్హమైన చర్యలకు దారితీస్తుంది. జిల్లాలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై జిల్లా ఐటీ నిపుణులు ద్వారా నిందితులను గుర్తించి, ఇదివరకే వారిపై తగిన కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ఇటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి మరియు ఇటువంటి తప్పుదోవ పట్టించే విషయాల పట్ల అప్రమత్తంగా ఉండాలి" అని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల సోషల్ మీడియా వినియోగంపై నిఘా ఉంచాలని, వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తిస్తే, వెంటనే 8712659599 కు సమాచారం అందించాలని కోరారు



# పేపర్ బాయ్ నుంచి టెన్త్ విజేతగా



ఉప్పునుంతల :అమృత్ తెలంగాణ: ఓ చిన్నారి కలలు పెద్దవి కావచ్చు, కానీ అవి నిజమవ్వాలంటే సంకల్పవే ఆయుధం కావాలి. అలాంటి ఓ కథ – భాను ప్రసాద్ గాథ. పేదింటి పిల్లవాడు, పేపర్లు పంపుతూ కుటుంబానికి తోడుగా నిలుస్తూ చదువు అనే దీపాన్ని ఆరనివ్వకుండా సాగించిన అతని పోరాటం ఇప్పుడు పలువురికి ప్రేరణగా మారింది. ప్రతీరోజూ తెల్లవారుజామునే లేచి పేపర్లు పంపించి, అనంతరం పాఠశాలకు వెళ్లే భాను ప్రసాద్ ఇప్పుడు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి, తన కలలకు ఒక అడుగు దగ్గరయ్యాడు. ఇతని విజయానికి ముఖ్య కారణంగా నేడు యువజన కాంగ్రెస్ నుండి వచ్చిన సాయం. ఆర్థికంగా వెనుకబడిన ఇతనికి అవసరమైన పుస్తకాలు, ఫీజుల భారం, మానసిక భరోసా అందించడంలో యువజన కాంగ్రెస్ ప్రముఖ పాత్ర వహించింది. "నన్ను నమ్మిన యువజన కాంగ్రెస్ నాయకులకు నా జీవితాంతం కృతజ్ఞత," అంటూ భావోద్వేగంగా తెలిపిన భాను ప్రసాద్, పోలీస్ అధికారి కావాలన్న కలను నెరవేర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తానంటున్నాడు. ఇటువంటి కథలు యువతలో ఆశ రేకెత్తిస్తాయి. 'పరిస్థితులు కాదు, మన లక్ష్యం దిశగా నడిచే సంకల్పమే మన నిజమైన బలంగా మారుతుంది' అనే సందేశాన్ని భాను ప్రసాద్ గుర్తు చేశారు. పేపర్ బాయ్‌గా పని చేస్తూ ఉన్నత విద్య కోసం పోరాడుతున్న విద్యార్థికి యువజన కాంగ్రెస్ ఆర్థికంగా అండగా నిలిచింది. మండల కేంద్రానికి చెందిన మేడమోని భాను ప్రసాద్ ఈ ఏడాది జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో పదవ తరగతిలో 500కు పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. ఉన్నత చదువుల కోసం సికింద్రాబాద్ ప్రభుత్వ కళాశాలలో చేరిన భాను, ఉదయం పేపర్లు వేస్తూ హాస్టల్ ఫీజు కట్టేంతవరకు శ్రమిస్తున్నాడు. భానును ప్రోత్సహించేందుకు యువజన కాంగ్రెస్ ఉప్పునుంతల మండల శాఖ తరఫున శుక్రవారం రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. "నేటి యువతకు చదువు ఒక ఆయుధం. వెనుకబడిన వర్గాల పిల్లలు ముందుకు రావాలంటే మేం అండగా నిలవాలి. భాను లాంటి ప్రతిభావంతుల్ని చూస్తే గర్వంగా ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేడమోని భాస్కర్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వెల్టూరి రేణయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రత్లావత్ కృష్ణ, ఉమామహేశ్వర దేవస్థానం కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, తాలూకా ఉపాధ్యక్షుడు మొగిలి మహేష్, యువ నాయకులు ఎడ్ల నరేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మండలి శివ శంకర్, పానం సైదులు, గుద్దటి బాలరాజు, కొట్టే శ్రీను, మాతృ నాయక్, రేణయ్య అఖిల్, వగ్గు శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

డిండి:అమృత్ తెలంగాణ: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా 2025 26 విద్యాసంవత్సరానికి సంబంధించి మొదటి రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డిండిలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి పాపి రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి రామారావు మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులతో కూడిన సొంత భవనాలలో నాణ్యమైన విద్య ఉచితంగా అందించబడుతుందన్నారు. డిండి గ్రామ ప్రజలు ప్రభుత్వ పాఠశాలలో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి గ్రామ నాయకులు ఏటీ కృష్ణ, బలుముల ప్రేమ్ కుమార్, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం..

జన్నారం:అమృత్ తెలంగాణ: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి రాజకుమార్కు మంజూరైన రూ.26 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో రాజ్కుమార్ కాలువిరగడంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని, సీఎం రిలీఫ్ ఫండ్కు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఆయనకు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చెక్కు మంజూరు చేయించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎంసీ డైరెక్టర్ ప్రదీప్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుగులావత్ రవి, మాజీ ఉపసర్పంచ్ చిందం చంద్రయ్య,కె. శ్రీనివాస్ కోవ శాంతయ్య గుండా నరసయ్య, సాదం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



## బీర్ల కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గున్న సంజీవరెడ్డి


యాదగిరి గుట్ట :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ విప్ ఆలేర్ ఎమ్మెల్యే ఏ బీర్ల ఐలయ్య జన్మదినం సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ వి ఎస్ ఫౌండేషన్ చైర్మన్ గున్న సంజీవ రెడ్డి శుక్రవారం ఆయన నివాసంలో కలిసి జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ గజ మాల తో ఎమ్మెల్యే దంపతులను ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రియల్టర్ అంజయ్య యాదవ్, వర్తక సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులు, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు పేరబోయిన నర్సింహ, సీపీఐ నాయకులు బబ్బూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# ఊపేయడానికి సిద్దమైన హాట్ బ్యూటీ!



అమ్మడు తొలుత ఓ లవ్ స్టోరీతో వచ్చిన సమయంలో పూరి కళ్లలో పడటంతో 'ఇస్మార్ట్ శంకర్' లో చాన్స్ అందుకుంది. 'ఇస్మార్ట్ శంకర్' తో హాట్ బ్యూటీ గా వెలుగులోకి వచ్చిన నభా నటేష్ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు తొలుత ఓ లవ్ స్టోరీతో వచ్చిన సమయంలో పూరి కళ్లలో పడటంతో 'ఇస్మార్ట్ శంకర్' లో చాన్స్ అందుకుంది. దీంతో నభా అవకాశాలకు దూరమైంది. సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్ గా ఉంటూ అటెన్షన్ డ్రా చేస్తుంది. ఇన్ స్టాలో వెడెక్కించే ఫోటోలతో..భంగిమలతో అలరిస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా బ్యూటీ ఐటం భామగా కొత్త టర్నింగ్ తీసుకుంది. అదీ బాలీవుడ్ లో ఆ ఛాన్స్ రావడం విశేషం. సన్ని డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్- పీపూల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు హిందీలోనే నిర్మిస్తున్నాయి. ఇందులో ఐటం పాటకు పలువురు భామల్ని పరిశీలించి చివరిగా నభా నటేష్ ని ఎంపిక చేసారు. ఈ పాట కోసం హైదరాబాద్ లో ప్రత్యేకంగా ఓ భారీ సెట్ ని సిద్దం చేసారు. నేటి నుంచే ఆ పాట చిత్రీ కరణ కూడా మొదలవుతుందని సమాచారం. ఇప్పటి వరకూ నభా నటేష్ ఐటం పాటల్లో నటించలేదు. తొలిసారి ఆ రకంగానూ అమ్మడు అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. హీరోయిన్ అవకాశాలు లేని నేపథ్యం లో? మొదలైన ఈ కొత్త జర్నీతోనైనా బిజీ అవుతుందేమో చూడాలి. తెలుగులో చివరిగా డార్లింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా గత ఏడాది రిలీజ్ అయింది. ఆ తర్వాత మళ్లీ కొత్త ప్రాజెక్ట్ దేనికి సైన్ చేయలేదు.

# ఐకాన్ స్టార్.. 22 ఏళ్ల బ్లాక్ బస్టర్ జర్నీ!




స్టైలిష్ స్టార్ నుంచి నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఐకాన్ స్టార్ వరకు అల్లు అర్జున్ చేసిన సినీ ప్రయాణం ఒక బిగ్ రికార్డ్ అనే చెప్పాలి. స్టైలిష్ స్టార్ నుంచి నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఐకాన్ స్టార్ వరకు అల్లు అర్జున్ చేసిన సినీ ప్రయాణం ఒక బిగ్ రికార్డ్ అనే చెప్పాలి. 2003లో గంగోత్రితో అరంగేట్రం చేసిన బన్నీ, మొదటి సినిమా నుంచే తన ప్రత్యేకతను చాటాడు. తర్వాత వచ్చిన ఆర్య సినిమాతో యూత్ ఐకాన్‌గా నిలిచిన అతడు.. 'బన్నీ', 'దేశముదురు', 'పరుగు', 'ఆర్య 2' లాంటి హిట్ సినిమాలతో తన స్టైల్, డాన్స్, యాక్టింగ్‌కు మాస్ ఫాలోయింగ్‌ను సొంతం చేసుకున్నాడు. బన్నీ ప్రయాణంలో వేదం, జులాయి, సరైనోడు, దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురములో' వంటి చిత్రాలు నటుడిగా అతన్ని మరో లెవెల్ కు తీసుకు వెళ్లాయి. ఇప్పుడైతే 'పుష్ప' సినిమా అతని కెరీర్‌కు మరింత బూస్ట్ ఇచ్చింది. దర్శకుడు సుకుమార్‌తో కలిసి చేసిన ఈ మాస్ యాక్షన్ డ్రామా రెండు భాగాలుగా తెరకెక్కింది. 'పుష్ప 2: ది రూల్' ప్రపంచవ్యాప్తంగా రూ.1800 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి బన్నీకి పాన్ ఇండియా స్టార్‌డమ్‌ను మరింత పక్కాగా తీసుకువచ్చి అంతే కాకుండా, ఈ సినిమాతో బన్నీ నేషనల్ అవార్డ్ గెలుచుకున్న తొలి తెలుగు నటుడిగా నిలిచాడు. ఇది అతని కెరీర్‌లోనే గోల్డెన్ మైలురాయి. పుష్ప 2 తర్వాత బన్నీ స్పీడ్ మోడ్‌లోకి వెళ్లాడు. ఇంతకాలం ఒకే ప్రాజెక్ట్‌పై ఫోకస్ చేసిన బన్నీ, ఇప్పుడు ఒకేసారి రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నాడు. అట్లీ దర్శకత్వంలో ఓ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్, త్రివిక్రమ్ డైరెక్షన్‌లో ఒక ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా.. రెండూ పాన్ ఇండియా రేంజ్‌లో ప్లాన్ అవుతున్నాయి. రెండు సినిమాలను 2025లో బ్యాక్ టు బ్యాక్ సెట్స్‌పైకి తీసుకురావాలనే తపనతో బన్నీ ముందుకెళు తున్నాడు. ఫ్యాషన్, హ్యాండ్‌సమ్‌నెస్, స్టైల్.. ఇలా. బన్నీ యూత్‌లో మాత్రమే కాదు, ఫ్యామిలీ ఆడియన్స్‌లోనూ మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు. గత రెండు దశాబ్దాల్లో బన్నీ చేసిన ప్రయోగాలు, విజయాలు చూసిన అభిమానులకు ఇప్పుడు అతనిలో ఉన్న విజన్ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం బన్నీ పాన్ ఇండియా స్టార్స్‌లో అత్యంత బిజీ హీరోగా ఉన్నాడు. 'పుష్ప' క్రేజ్‌ను నిలబెట్టుకోవడమే కాకుండా.. దాన్ని దాటిపోయే విధంగా ప్రాజెక్ట్స్ ప్లాన్ చేస్తున్నాడు. 22 సంవత్సరాల సినీ ప్రయాణంలో ఎన్నో రికార్డులను సాధించిన అల్లు అర్జున్.. మరో రెండు దశాబ్దాలు కూడా అగ్రస్థానంలోనే ఉంటాడని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. మరి అట్లీ, త్రివిక్రమ్ సినిమాలతో బన్నీ ఇంకెంత ఎత్తుకు చేరుకుంటాడో చూడాలి.


# మహేష్ ఫ్యాన్స్‌కి బిగ్ గుడ్ న్యూస్..!



అంటే సినిమా కచ్చితంగా 2026 చివర్లో లేదా 2027 లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. మహేష్ బాబు గత ఏడాది సంక్రాంతికి 'గుంటూరు కారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఏడాది పాటు ప్రీ ప్రొడక్షన్ వర్క్ తర్వాత ఇటీవల రాజమౌళి దర్శకత్వంలో సినిమా షూటింగ్‌కి జాయిన్ అయ్యాడు. హైదరాబాద్‌లో ఒక షెడ్యూల్‌ను పూర్తి చేసిన రాజమౌళి ఇటీవలే ఒడిశాలో రెండో షెడ్యూల్‌ను పూర్తి చేశాడు. మహేష్ బాబు నటిస్తున్న ఈ సినిమాను రాజమౌళి ఎప్పుడు విడుదల చేసేది క్లారిటీ లేదు. కానీ రాజమౌళి గత సినిమాలకు తీసుకున్న టైమ్‌ను చూస్తే మహేష్ బాబు సినిమాకు కూడా కనీసం రెండేళ్లు మేకింగ్‌కు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అంటే సినిమా కచ్చితంగా 2026 చివర్లో లేదా 2027 లో విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజమౌళి సినిమా కోసం మహేష్ బాబు ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ గ్యాప్ లో మహేష్ బాబు పాత సినిమాలను రీ రిలీజ్ చేస్తున్నారు. అంతే కాకుండా మహేష్ బాబు డబ్బింగ్ చెప్పిన ముఫాసా : ది లయన్ కింగ్ సినిమాను ఆస్వాదిస్తున్నారు. మహేష్ బాబు డబ్బింగ్ చెప్పిన ముఫాసా సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున కటౌట్లు ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ముఫాసా సినిమాకు తెలుగులో మహేష్ బాబు క్రేజ్ కారణంగా మంచి స్పందన దక్కింది. భారీ వసూళ్లు సాధించిన సినిమాగా ముఫాసా హాలీవుడ్ సినిమాల సరసన నిలిచింది. థియేట్రికల్ రిలీజ్‌లో హిట్ అయిన ముఫాసాను ఎప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ చేస్తారా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముఫాసా సినిమాను ఎట్టకేలకు ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు.




# రంగు రంగు రెక్కల సీతాకోక చిలుక..!



బాలీవుడ్ లో కొంతమంది భామలు రెగ్యులర్ గా వార్తల్లో ఉండాలని ఆరాటపడతారు. అలా ఉంటేనే అవకాశాలు వస్తాయన్న ఆలోచన కూడా ఉంటుంది. అందుకే ప్రతి విషయంలో తమ సందడి అందరికి తెలిసేలా చేస్తారు. స్టార్ ఫ్యామిలీ నుంచి వచ్చిన వారైతే ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటారు. మీడియా అటెన్షన్ మొత్తం వారి మీదే ఉండేలా చూసే బాలీవుడ్ స్టార్స్ లో శ్రీదేవి తనయ జాన్వి కపూర్ ఒకరు. వరుస సినిమాలతో సందడి చేస్తున్న అమ్మడు రెగ్యులర్ గా వార్తల్లోనూ ఉంటుంది. రీసెంట్ గా మిలి సినిమా ప్రమోషన్స్ కోసం మరింతగా చురుగ్గా పాల్గొన్నది జాన్వి. అక్కడ ఇక్కడ అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కా జాన్వి సినిమా ప్రమోషన్స్ చేస్తూ వచ్చింది. హీరోయిన్ గా నటించడమే కాదు ప్రమోషన్స్ లో కూడా తను పాల్గొంటూ సినిమాకు సపోర్ట్ గా నిలుస్తుని. మిలి సినిమా తండ్రి బోనీ కపూర్ నిర్మించడం వల్ల సినిమా మీద ఇంకా ఎక్కువ శ్రద్ధ చూపించింది జాన్వి కపూర్. ఫ్రైడే రిలీజైన మిలి సినిమా పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. అయితే ఆల్రెడీ మళయాళ వర్షన్ చూసిన ఆడియన్స్ కి ఈ సినిమా అంతగా ఎక్కకపోవచ్చు. సినిమా ప్రమోషన్స్ కోసమో లేక రెగ్యులర్ గానో కానీ లేటెస్ట్ గా తన లెహంగా కాస్టూం తో ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేసింది జాన్వి కపూర్.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com